నవంబర్ 1 వరకు దరఖాస్తులు

- వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

వ్యవసాయ వర్సిటీ, అక్టోబర్ 27: అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ ఒకటో తారీకు వరకు వ్యవసాయ అనుబంధ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య సూచించారు. రాష్ట్రంలో ఐకార్ సంస్థ నుంచి గుర్తింపు పొంది ఏ గ్రేడ్ లో ఉందని ఆయన సూచించారు. వ్యవసాయ కోర్సులకో ప్రైవేటు సంస్థల యాజమాన్యాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు ఇప్పిస్తామని వచ్చే దళారీలను నమ్మవద్దని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలు ప్రధానంగా రైతు కుటుంబాల నుంచి వచ్చే రైతులు ఫీజులకు భయపడుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సగానికి తగ్గించి కేవలం రూ.5 లక్షలు మాత్రమే కేటాయించామన్నారు. ఆసక్తి గల, అర్హత గల విద్యార్థులు వచ్చే నెల 1 వరకు www.pjtsau.edu.in సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హతను బట్టి పటణ ప్రాంతాల వారికి కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ముసారాం బాగ్‌లో మూసీ వెతలు

- ప్రభుత్వం చెబుతున్నదొకటి, చేస్తున్నది ఇంకోటి..
- శనివారం నుంచి కొనసాగుతున్న కూల్చివేతలు..
- ఆగ్రహంతో ఊగిపోతున్న బాధితులు
- ఉరి తీసే ముందు చివరి కోరిక ఎంత జఠిలమైనా తీరుస్తారు
- నిర్వాసితులకు ఇష్టమున్నచోట డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలన్న సీఎం రేవంత్
- అలా.. కుదరదంటున్న అధికారులు

అధికారులు ఇండ్లను కూల్చివేయటంతో మొండి గోడలతో బోసిపోయి కనిపిస్తున్న సాయిలు హట్స్ బస్తీ

మలక్‌పేట, అక్టోబర్ 27: మూసీలో కూల్చివేతల పర్వం కొనసాగుతూనే ఉంది. దసరా పండుగ ముందు విరామం ప్రకటించి 15 రోజులుగా కూల్చివేతలను నిలిపివేసిన ప్రభుత్వం, చడీ చప్పుడు కాకుండా శనివారం నుంచి మళ్లీ మొదలుపెట్టింది. మూసీ నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం చెబుతున్నదొకటి.. చేస్తున్నది ఇంకోటి, మొన్నటి వరకు మూసీ బాధితుల నివాసాల కూల్చివేతలను నిలిపివేసిన ప్రభుత్వం, మళ్లీ శనివారం నుంచి తిరిగి ప్రారంభించింది. బాధితులే స్వయంగా వారి ఇండ్లను కూల్చివేసుకుంటున్నారు. సంతోషంగా ఖాళీచేసి వెళ్లిపోతున్నారని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మూసీ నిర్వాసితులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. చాదర్‌ఘాట్‌లోని మూసానగర్, పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్ మూసీ నిర్వాసితులు పునరావాస డబుల్ బెడ్రూం ఇండ్లు బాగా లేవని, అక్కడ అనేక సమస్యలున్నాయని, అక్కడి కన్నా మూసీ పరీవాహక ప్రాంతంలోని తమ ఇండ్లే బాగుండేవని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తున్నామని ఆశ జూపి తమను సమస్యల్లో పడేశారని నిత్యం దుమ్మెత్తిపోస్తున్న విషయం తెలిసిందే. ఉరి తీసే ముందు చివరి కోరిక ఎంత జఠిలమైనదైనా, అసాధ్యమైనదైనా తప్పక తీరుస్తారని, అలాంటిది మూసీలో ఇండ్లను కోల్పోతున్న నిర్వాసితులకు, వారికి ఇష్టమున్నచోట డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వాలని, ఎవ్వరిని అక్కడిపో, ఇక్కడిపో అని బలవంతపెట్టోద్దని నీతి సూక్తులు వల్లించిన ముఖ్యమంత్రి, తమ ఇష్టాలకనుగుణంగా తాము కోరినచోట ఇండ్లు ఇవ్వటంలేదని బాధితులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నచ్చినచోట ఇల్లును కేటాయించుమంటే అధికారులు అలా కుదరదు. అక్కడ ఇవ్వలేం.. అది మా జిల్లా పరిధిలో లేదు. మేం ఇచ్చే ఆప్షన్లలో ఏదో ఒకటే ఎంచుకోవాలని ఒకమాట, అక్కడ ఇవ్వాలంటే కలెక్టర్ పర్మిషన్ కావాలని, కలెక్టర్ వద్ద నుంచి పర్మిషన్ లెటర్ తెచ్చి ఇస్తే అది అంతా సులువైన పని కాదని, ఇవ్వటానికి చాలా టైం పడుతుందని అధికారులు చెబుతున్నారని బాధితులు మండి పడుతున్నారు.

వనస్థలిపురంలో ఇవ్వమంటే వేరే చోట ఇస్తరా?

మూసీ రివర్ బెడ్‌లో మా ఇల్లు పోయింది. అధికారులు మాకు డబుల్ బ్రెడూం ఇల్లును జియాగూడలో అలాట్ చేశారు. కానీ, అక్కడికి వెళ్లాలంటే మా ఆయన జీవనోపాధిని కోల్పోవాల్సి వస్తుంది. మా పిల్లల చదువుల విషయంలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాకు అక్కడ కాకుండా వనస్థలిపురంలో ఇల్లు ఇస్తే అన్ని విధాల బాగుంటుందని అధికారులను కోరాను. అయితే, నచ్చిన చోట ఇల్లును కేటాయించుమంటే అధికారులు అలా కుదరదు, అక్కడ ఇవ్వలేం, అది మా జిల్లా పరిధిలో లేదు. మేం ఇచ్చే ఆప్షన్లలో ఏదో ఒకటే ఎంచుకోవాలని, దూరంగా ఉన్న ప్రాంతాల పేర్లు ఇచ్చారు. కోరిన చోట ఇవ్వాలంటే కలెక్టర్ పర్మిషన్ కావాలని చెప్పారు. నేను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ వద్ద నుంచి పర్మిషన్ లెటర్ తెచ్చి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఇచ్చి పదిరోజులవుతుంది. ఇంత వరకు ఏమీ స్పందన లేదు.

– మ్యాతరి అరుణ (సాయిలు హట్స్)

బాగు చేస్తడని ఓటేస్తే.. బర్బాత్ చేసిండు

నలభయ్యేండ్లుగా ఒకేచోట అంతా కలిసి మెలిసి ఉన్నం. మూసీ సుందరీకరణ పేరుతో మమ్మల్ని చెట్టుకొకల్ని, పుట్టకొకల్ని చేసిండ్రు. ఎవరికి నచ్చిన చోటికి వారు వెళ్తున్నారు. బాగు చేస్తడని ఓటేస్తే బర్‌బాత్ చేస్తుండు. మా జీవితాలతో ఆడుకుంటున్నదీ.. కాంగ్రెస్ ప్రభుత్వం. ఇక్కడి నుంచి వెళ్లాలని లేదు. కానీ, ఇష్టం లేకున్నా వెళ్లాల్సి వస్తుంది. ఏం చేస్తం, నాయకులు మేలు చేస్తారని గెలిపిస్తే మా బతుకులతోనే ఆడుకుంటున్నరు. ప్రజల గురించి ఆలోచించేటోడు నాయకుడు. ప్రజల్ని పీక్కు తినోటోడు.. బకాసూరుడు.. రాక్షసుడు. మా పేదోల్ల ఉసురు తప్పక తగులుద్ది. పైవాడు అంతా చూస్తున్నడు.. మా బతుకులతో ఆడుకున్న ముఖ్యమంత్రి బతుకు ముందెట్లా ఉంటదో.. ఇగ చూడమా? మేము ఉపాధి కోల్పోయి, పిలగాండ్ల చదువుల్ని కూడా దుర్భరం చేసుకొని ఇక్కడి నుంచి వెళ్లి పోవాల్సి వస్తుంది.

– రామకృష్ణ (అంబేద్కర్‌నగర్ బస్తీ)

నాచారంలోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా మెడికల్ సీటు సాధించిన విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

కేటీఆర్ రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్తేజం

- జై కేసీఆర్... జై కేటీఆర్ నినాదాలతో మార్మోగిన నాచారం
- కేటీఆర్‌కు స్థానికుల ఘన స్వాగతం
- నాచారం ఎస్టీపీ పరిశీలన... కాలనీలో సమావేశం

ఉప్పల్, అక్టోబర్ 27: నాచారంలోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వివేకానంద, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్ శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్, పన్నాల దేవేందర్ రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, శిరీషా సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థులకు చెక్కుల పంపిణీ

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన మెడికల్ సీటు సాధించిన 20 మంది విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఫీజుల కోసం చెక్కులను కేటీఆర్ చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఎలాంటి సహాయం కావాలన్న ఎమ్మెల్యేను సంప్రదించాలని, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసానూ అందించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి హర్షం వ్యక్తం చేశారు.

ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఆర్.కృష్ణయ్యకు సన్మానం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ సంఘం నేతలు

రవీంద్రభారతి, అక్టోబర్ 27: దేశ వ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, బీసీ మంత్రిత్వ శాఖను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, పూర్వ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీల జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, బీసీలపై క్రిమిలేయర్ ఎత్తివేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు లేని క్రిమిలేయర్‌ను బీసీలకు ఎందుకు పెట్టారని కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించి బీసీలకు తీరని నష్టం చేస్తుందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పునరాలోచించి బీసీ రిజర్వేషన్లలో కోతను నివారించాలన్నారు. ప్రవేట్ రంగంలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ వ్యక్తి ఇప్పటి వరకు సుప్రీం కోర్టు జస్టిస్ కాలేదని, దేశ వ్యాప్తంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బీసీలు మూడు శాతం కూడా లేరని ఆయన చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సర్కిల్ సెక్రటరి ఎస్.శివకృష్ణ, అసోసియేషన్ నేతలు ధర్మరాజు, విజయ్ కుమార్, కె.సురేశ్, నరేష్‌తో పాటు జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

తై బజార్ దరఖాస్తులకు నేడు ఆఖరు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 27 : భువనగిరి మున్సిపాలిటీ తై బజార్ దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 26తో ముగియనుండగా శనివారం బ్యాంకులకు సెలవు ఉండడంతో ఈ నెల 28న సాయంత్రం 4గంటల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

పిలాయిపల్లి - దేశ్‌ముఖి రోడ్డుకు మరమ్మతులు చేయాలి : పీవైఎల్

దేశ్‌ముఖి రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న ప్రగతిశీల యువజన సంఘం నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 27 : మండలంలోని పిలాయిపల్లి నుంచి దేశ్‌ముఖి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) పట్టణ కార్యదర్శి పగడాల శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దేశ్‌ముఖి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిలాయిపల్లి నుంచి దేశ్‌ముఖి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలన్నార. కార్యక్రమంలో నాయకులు ఏసూరి బుచ్చయ్య, కె.మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, నరేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారి సెంటర్‌లో దీపావళి ఉత్సవాలు

దీపావళి ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, అక్టోబర్ 19 : పట్టణంలోని బ్రహ్మకుమారి సెంటర్‌లో ఆదివారం దీపావళి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు హాజరై పండుగ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు స్వర్ణలత, సునీత, నాయకులు మురళి, లక్ష్మీపతి, సత్యనారాయణ, కనకారావు, ముత్యాలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి : సీపీఎం

మోత్కూరు, అక్టోబర్ 27 : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. దాంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తమ పంటను తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. దళారులకు ధాన్యం అమ్మవద్దని చెబుతున్న ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు పసునూరి చంద్రారెడ్డి, దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేశ్, కురిమేటి యాదయ్య పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే చాంద్

రామన్నపేట, అక్టోబర్ 27 : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని మైనార్టీ విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే చాంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఉద్యమకారుల సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి కమిటీ వేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సంక్షేమ బోర్డు, కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లల్లో 10శాతం ఉద్యమకారులకు కేటాయించాలని కోరారు. ఉద్యమకారుల సంఘం మండలాధ్యక్షుడు నోముల శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బొడ్డుపల్లి లింగయ్య, ఎండీ హిమామ్, పూసల బాలయ్య, ప్రవీణ్, కృష్ణ, పరిటాల రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెట్రో రెండో దశకు ముందడుగు

కేబినెట్ ఆమోదంతో కేంద్రానికి చేరిన డీపీఆర్

- అంచనా వ్యయం రూ.24,269 కోట్లు
- కేంద్రం నిర్ణయంపైనే మెట్రో భవిత
- 5 కారిడార్లలో 76.4 కి.మీ నిర్మాణం

సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు హైదరాబాద్ మహానగరంలో రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు మరో అడుగు ముందుకు పడింది. నగరం విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌లకు శనివారం రాత్రి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రెండో దశలో 5 మార్గాల్లో మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించే మెట్రో ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24,269 కోట్లు కాగా, అందులో 30 శాతం రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. మెట్రో రెండో దశను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు కొంత మేర పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల తర్వాత డీపీఆర్‌ను హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ సిద్ధం చేసింది. కొన్ని నెలలుగా ప్రతిపాదిత మెట్రో మార్గాల్లో మార్పులు, చేర్పులు చేసి చివరకు రెండో దశలో 76.4 కి.మీ మార్గాలను ఖరారు చేశారు. జూన్,జూలై నాటికే డీపీఆర్‌లను పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఫోర్త్ సిటీ పేరుతో ఎంతో కాలయాపన చేసింది. రెండోదశలో మెట్రోలోనే ఫోర్త్ సిటీ మెట్రో మార్గాన్ని 40 కి.మీ మేర నిర్మిస్తామని ప్రకటించిన, చివరకు దాన్ని పక్కన పెట్టింది.

కేంద్రం సహకరించేనా...?

హైదరాబాద్ మహానగరంలో చేపట్టే మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పని సరి. అనుమతులన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 5 మెట్రో కారిడార్‌లకు ఆమోదం ఉంటుందా అన్నది తేలాల్సి ఉంటుంది. అనుమతులకు తోడు కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను సైతం కేటాయించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణానికి ఒకేసారి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయడంతో, ఆ స్థాయిలో నిధులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఎంత సమయంలో ఈ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందోనన్న అనుమానం వ్యక్తమవుతోంది. దేశంలోని వివిధ మెట్రో నగరాల్లో నిర్మిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులతో పాటు వేలాది కోట్ల నిధులను కేటాయిస్తున్నా, అవి రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే కేటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం ఎంత వరకు సహకరిస్తుందో వేచి చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వద్ద మెట్రో ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయించలేని పరిస్థితి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే ప్రాజెక్టును చేపట్టాల్సి ఉంటుంది.

రెండో దశలో డీపీఆర్ సిద్ధం చేసిన మెట్రో మార్గాలు..

- నాగోల్–శంషాబాద్ ఎయిర్‌పోర్టు 36.8 కి.మీ.
- రాయదుర్గం–కోకాపేట నియోపొలీస్–11.6 కి.మీ
- ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట– 7.5 కి.మీ
- మియాపూర్– పటాన్‌చెరువు – 13.4 కి.మీ
- ఎల్‌బీనగర్ – హయత్‌నగర్ – 7.1 కి.మీ

ఘనంగా ఆచార్యకులం వార్షికోత్సవం

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ విద్యాసంస్థ ఆచార్యకులం 12వ వార్షికోవాన్ని ఆదివారం పతాంజలి యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైని, విద్యాసంస్థ వ్యవస్థాపకుడు పరమ పూజ్య స్వామిజీ మహారాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో స్వామి అవదేశానంద్, స్వామి రవీంద్ర పురి, స్వామి హరిచెత్నానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ.. మాకు న్యాయం చేయండి

మాట్లాడుతున్న ఒప్పంద క్రీడా శిక్షకుల సంఘం అధ్యక్షురాలు టీవీఎల్ సత్యవాణి

సుల్తాన్ బజార్, అక్టోబర్ 27: దేవుడు వరమందించినా.. పూజారి కరుణించలేదన్న చందంగా, 32 ఏండ్లుగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థలో కోచ్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఒప్పంద క్రీడా శిక్షకుల సంఘం అధ్యక్షురాలు టీవీఎల్ సత్యవాణి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎల్‌బీ స్టేడియంలోని ఒలంపిక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 1993, 1999, 2009 బ్యాచ్‌లకు చెందిన సుమారు 27 మంది శిక్షకులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వీరంతా ప్రభుత్వ నిబంధనలకి లోబడి రోస్టర్ విధానంలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ అయ్యారని అన్నారు. ఇదిలా ఉండగా 1993, 1999 బ్యాచ్‌ల క్రీడా శిక్షకులను క్రమబద్ధీకరించటానికి న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. కాగా, ఏ ఉత్తర్వులు తమకు న్యాయం చేయలేదని అన్నారు. ఈ 28 మంది కారణంగా అన్యాయానికి గురయ్యాయమని అన్నారు. న్యాయపరమైన అడ్డంకులు లేకుండా ఉద్యోగస్థులు వేర్వేరు ప్రభుత్వాలల్లో బడి రోస్టర్ విధానాన్ని పాటిస్తూ నోటిఫికేషన్ ద్వారా భర్తీ అయిన వారు తెలంగాణలో ఎవరూ లేరని అన్నారు. క్రీడలపై మక్కువతో రెగ్యులర్ ఉద్యోగాలని వదిలేసి వచ్చిన వారు, ఇంకొక రెండు, మూడు నెలల్లో రిటైర్మెంట్ అయ్యే వారున్నారని అన్నారు. వయస్సు దాటిపోయి వేరే ఉద్యోగాలకు వెళ్ళలేని వారు ఈ క్రీడా శిక్షకులలో ఉన్నారని అన్నారు. కులమతాలకు అతీతంగా క్రీడా రంగం ఉంటుందన్నారు. పీఈటీలకు, క్రీడా శిక్షకుడికి వ్యత్యాసం తెలియని పాలనలో పనిచేశామని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నెల రోజుల వరకు వేచి చూస్తాం. అయినా, కాని పక్షంలో న్యాయ పోరాటానికి సిద్ధమై భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఒప్పంద క్రీడా శిక్షకుల సంఘం కార్యదర్శి ఏఎన్‌కే గోకుల్, కోశాధికారి సతీశ్, సభ్యులు ఎమ్డీ గౌస్, రతన్ కుమార్ బోస్, శ్రీకాంత్, శ్రీను, అక్బర్, వినోద్, స్వర్ణలత, అక్బర్ అలీ, దేవిక పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలోపేతం చేయాలి

ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభల వేదికపై అతిథులు

సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): ఎల్ఐసీతో పాటు ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలోపేతం చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. రెండురోజులుగా దోమల్‌గూడ సుగుణాకర్ రావు భవన్ క్లెమెంట్ దాస్ ఆడిటోరియంలో జరుగుతున్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల 23వ సంయుక్త మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నామని, బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలని, నేషనల్ మానిటైజేషన్ పైపులైన్‌ను వ్యతిరేకిస్తున్నామని, ఎల్ఐసీలో క్లాస్ 3, 4 ఉద్యోగాల నియామకం వెంటనే చేపట్టాలంటూ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ప్రతినిధుల సమావేశానికి ఆల్ ఇండియాఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రమేశ్, కోశాధికారి రవి, జోనల్ నాయకులు సుజాత, టీవీఎస్ ఎన్ రవీంద్రనాథ్, ఆర్ శ్రీనివాసన్, రాజేశ్‌సింగ్, వి.మైథిలీ తదితరులు పాల్గొని మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి గాను హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడుగా డి.గిరిధర్, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ లక్ష్మి, రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, కోశాధికారిగా యాదగిరి రావు, సంయుక్త కార్యదర్శులుగా గణేశ్, రవీందర్ ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా గుణశేఖర్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా వివేక్ కౌశిక్ ఎన్నికయ్యారు.

క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఏసీపీ కొత్త కిషన్‌రావు

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

- ఏసీపీ కొత్త కిషన్‌రావు

భువనగిరికలెక్టరేట్, అక్టోబర్ 27 : యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఏసీపీ కొత్త కిషన్ రావు సూచించారు. మండలంలోని అనంతారం పరిధిలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల విద్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 14–19 విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆదివారం ఆ